క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు


మాజీ సీఎం కేసీఆర్‌తో గూడూరి సురేశ్

గన్నేరువరం: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట చంద్రశేఖర్‌రావును మానకొండూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అధ్యక్షుడు గూడూరి సురేశ్ బుధవారం ఎర్రవల్లిలో కకలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలని కోరగా తప్పకుండా యువతకు అవకాశం కల్పిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని, ప్రజల తరఫున ప్రజా సమస్యలను లేవనెత్తుతూ ముందుకుసాగాలని సూచించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సారథ్యంలో మెజార్టీ స్థానాల్లో గెలుపొందాలన్నారని సురేశ్ తెలిపారు.

జాతీయ యోగాసన కోచ్‌గా కోటేశ్వర్‌రావు


విద్యార్థులతో కోటేశ్వర్‌రావు

శంకరపట్నం: కేరళలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ యోగాసన పోటీలకు తెలంగాణ కోచ్‌గా మండలంలోని వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్కాకుల కోటేశ్వర్‌రావు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి 24మంది వివిధ జిల్లాలకు చెందిన సీనియర్ క్రీడాకారులు ఎంపిక కాగా తిరువనంతపురం బయలుదేరామని కోటేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రానికి బంగారు పతకం సాధించేందుకు శిక్షణ ఇచ్చామన్నారు.

కళాకారులకు సన్మానం


సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా డప్పు కళాకారులను ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. జనవరి 26న ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డేలో రాష్ట్రం తరఫున మెట్‌పల్లి డప్పు కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శన ఇవ్వగా ఇటీవల ఓ టీవీ చానల్‌లో ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వంతడ్పుల సతీష్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దాసారపు భద్రయ్య, వంతడ్పుల సంపత్, బొజ్జరవి, శంకర్, తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ


మాట్లాడుతున్న వెంకటస్వామి

శంకరపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మండలంలోని కేశవపట్నంలో బుధవారం పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు కావడంలేదని, ప్రజల్లో వ్యతిరేఖత వచ్చిందని, నిరంకుశ పాలన చేసిన బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని, స్థానిక ఎన్నికల్లో పొత్తులకు కాంగ్రెస్ ముందుకు వస్తే బలమైన స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి సమ్మయ్య, బాదుల్లా, రవి, దేవయ్య, లక్ష్మణ్, రామస్వామి, సాయిలు, నరేశ్, సాగర్, అశోక్, భానుశంకర్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు యువత బానిసకావొద్దు

చొప్పదండి: యువత మత్తుపదార్థాలకు బానిసకావొద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్‌ఐ విజయభాస్కర్ సూచించారు. మంగళవారం చొప్పదండి మండలం రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో మత్తుపదార్థాలు-అనర్థాలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి బారినపడితే భవిష్యత్ అంధకారమవుతుందని, జీవితంలో నిష్ప్రయోజకులుగా మిగిలిపోతారని, భవిష్యత్‌ను కాపాడుకోవాలని సూచించారు. కలెక్టర్ సూచన మేరకు పాఠశాలలో కాన్షియస్నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు, ఎక్సైజ్ సిబ్బంది అశోక్, ప్రశాంత్, క్రిషిధర్ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు..?

- అద్దెభవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు
- సొంతభవనాల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- ఖాళీల భర్తీని మరిచిన సంబంధిత అధికారులు


చిగురుమామిడి అంబేడ్కర్ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో పలు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో 17 గ్రామాలుండగా ప్రభుత్వం చిన్నపిల్లలు, బాలింతల, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు 39 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. 23 కేంద్రాలు సొంతభవనాల్లో, 12 అద్దెభవనాల్లో, నాలుగు అద్దెలేని భవనాల్లో కొనసాగుతున్నాయి. అలాగే వీటిలో నాలుగు కేంద్రాలకు వర్కర్లు, ఐదు కేంద్రాలకు ఆయాలు లేరు. కేంద్రాల పనితీరు, కార్యకర్తల పని ఎప్పటికప్పుడు ఎలుగెత్తిచూపాల్సిన ఆరోగ్యలక్ష్మి కమిటీలు సరిగా పనిచేయడంలేదు. వీటికి తోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. కొందరు వినియోగించుకోకపోగా మరికొందరికి రావడంలేదని తెలుస్తోంది. వర్కర్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నపిల్లలు రావడంలేదు. ఇలాంటి కేంద్రాలపై ఐసీడీఎస్ ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదు. మండల వ్యాప్తంగా మూడేళ్లలోపు 779 మంది, 3 నుంచి 5 ఏళ్లలోపు 349 మంది పిల్లలకు ప్రతిరోజు కేంద్రాల్లోనే పౌష్టికాహారం అందిస్తున్నారు. సుందరగిరి, నవాబుపేట్‌లో రెండేసి, బొమ్మనపల్లిలో ఒక కేంద్రం మొత్తం ఐదు అద్దెభవనంలో కొనసాగుతున్నాయి. మిగిలిన 12 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో, అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా శాశ్వత భవనాల జాడే లేదు. మండల వ్యాప్తంగా తొమ్మిది పోస్టులు పదేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. భర్తీపై ఐసీడీఎస్ ఉన్నతాధికారులు దృష్టిసారించలేకపోవడంతో ఆయా కేంద్రాల్లో విద్యాభ్యాసం కుంటుపడుతోంది. వర్కర్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు సరిగా చిన్నపిల్లలు రావడంలేదు. ఐసీడీఎస్ అధికారులు దృష్టిసారించాడం లేదు. బాలింతలు, గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలు పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశాలు నిర్వహించకపోవడంతో కేంద్రాలకు రావడం లేదు. ఐసీడీఎస్ అధికారులు ఆరోగ్యలక్ష్మి కమిటీలను ఏర్పాటు చేయించినా ఫలితం లేదు. కమిటీలో 11 మంది సభ్యులుంటారు. ప్రతి కమిటీకి స్థానిక సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉండగా నామమాత్రంగానే వ్యవహరిస్తున్నాయి.

కేంద్రాలను సమీక్షిస్తున్నాం

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించడమేకాకుండా బలోపేతానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. నెలకు రెండుసార్లు సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు తగిన సలహాలు ఇస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ సరిగా అమలవుతోంది. ఖాళీలను ప్రభుత్వమే భర్తీ చేయాల్సి ఉంటుంది.

– రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, చిగురుమామిడి


చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో పంపిణీ చేసిన బహుమతులతో విద్యార్థులు

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ వనజ

తిమ్మాపూర్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు బుధవారం సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్(రిటైర్డ్ టీచర్), ప్రిన్సిపాల్ వనజ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టాలెంట్ స్కూల్ నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బి.అర్చన, ఏ.మేఘన, పి.సాహితి, ఎస్.దేవి, పి.సామ్రాట్‌కు డిక్షనరీలు, మెమొంటోలు పంపిణీ చేశారు. అధ్యాపకులు పావని, అంజయ్య పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్క నూర్ మోడల్ స్కూల్ పదోతరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. వంద మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన ఐదుగురికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షిత్‌కౌర్, ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో నెమలి మృతి

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధిలో గల ఉపఘ్న హోమ్స్ ఆవరణలో నెమలి విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. డ్యామ్‌కు సమీపంలో, చుట్టూ చెట్ల పొదలు ఉండడంతో నిత్యం నెమళ్లు ఉపఘ్న హోమ్స్ ఆవరణలోకి వస్తుంటాయి. బుధవారం సాయంత్రం నెమలి ఎగురుతూ కాలనీలోని విద్యుత్ తీగలకు తాకింది. షాక్‌కు గురై మృతిచెందింది. దీంతో కాలనీవాసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

పాఠాలు బోధించిన మున్సిపల్ కమిషనర్


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న సమ్మయ్య

హుజూరాబాద్: పన్నుల వసూలులో భాగంగా బుధవారం పట్టణంలోని ఓ పాఠశాలకు వెళ్లిన హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య టీచర్‌గా మారి పిల్లలకు పాఠాలు బోధించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఇంటి పన్నులు వసూలు చేస్తుండగా న్యూ కాకతీయ పాఠశాల పదో తరగతి పిల్లలకు కొద్దిసేపు పాఠాలు చెప్పారు. తాను టీచర్‌గా పనిచేశానని కష్టపడి కమిషనర్ అయ్యానని లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకుసాగాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్, డైరెక్టర్స్ మంచికట్ల గోపాల్, వెంగల్‌రావు తదితరులున్నారు.

కాంగ్రెస్ పాలన మున్నాళ్ల ముచ్చట


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేస్తామనిని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గన్నేరువరంలోని కల్యాణమండపంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మున్నాళ్ల ముచ్చటగానే ఉందని ఎద్దేవా చేశారు, ఎన్నికల హామీల అమల్లో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని, ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. గన్నేరువరం మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని, ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కుసుంభ నవీన, మాజీ జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, సుధాకర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని రేకొండలో మంగళవారం చెంచల సంపత్ చింతచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, సంపత్ మృతికి కారకురాలైన బిళ్లా చిలుకవ్వ ఇంటి ఎదుట మృతుడి కుటుంబసభ్యులు, దళిత సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. గాదెపాక రాజుకు చెందిన చింతచెట్టు ఎక్కి కాయలు తెంపాలని సంపత్‌ను చిలుకవ్వ కోరింది. తనకు చెట్టు ఎక్కరాదని చెప్పినా బలవంతంగా ఎక్కించింది. దీంతో సంపత్ ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని ప్రత్యక్ష సాక్షులు చెప్పడంతో బాధిత కుటుంబీకులు, దళిత సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఎస్సై రాజేశ్ ఇరువర్గాలను శాంతింపజేశారు. ఇరువర్గాలకు రాజీ కుదరడంతో ఆందోళన విరమించారు.

ప్రసన్నహరికృష్ణకు మొదటి ప్రాధాన్యమివ్వాలి

చిగురుమామిడి: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రొఫెసర్ పులి ప్రసన్నహరికృష్ణను ఆదరించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ కోరారు. బుధవారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 19 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికీ ప్రజా సేవకు వృత్తిని వదిలి పోటీ చేస్తున్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మల్లేశం, కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొంరయ్య, సంఘం నాయకులు వెంకటేశ్, చొక్కాచారి, రవీందర్ గౌడ్, నారాయణగౌడ్, అజీమ్ పాల్గొన్నారు.

అశోక్‌కుమార్‌ను గెలిపించాలి

జమ్మికుంట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. బుధవారం పట్టణంలో టీపీటీఎఫ్ టీచర్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. విద్యా, ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులను చట్టసభలకు పంపాలని పిలుపునిచ్చారు. టీపీటీఎఫ్ నాయకులు అవినాశ్, తిరుపతి, తిరుపతి, హరికిషన్, రామస్వామి పాల్గొన్నారు.


హుజూరాబాద్: వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

హుజూరాబాద్: మండలంలోని సింగాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. గోవింద నామస్మరణ, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకల్లో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. కార్యక్రమంలో వొడితెల కుటుంబ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీమత్స్యగిరీంద్రస్వామి జాతర

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లిలో స్వయంభూ శ్రీమత్స్యగిరీంద్రస్వామి జాతర బుధవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య పల్లకీ సేవా, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండి, ట్రాక్టర్లలో వచ్చి మత్స్యగిరీంద్రున్ని దర్శించుకున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను దేవాలయం గుట్ట చుట్టూ తిప్పారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

కొత్తగట్టు జాతరకు పోటెత్తిన భక్తులు

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కోనేరులో పవిత్ర స్నానం చేసి దర్శనం చేసుకున్నారు. పౌర్ణమి జాతర సందర్భంగా హుజూరాబాద్ కోర్టు న్యాయమూర్తులు కిరణ్‌కుమార్, పద్మసాయిశ్రీ మత్స్యగిరీంద్రస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. క్యూలైన్‌లో భక్తురాలు అస్వస్థతకు గురికావడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. కేశవపట్నం ఎస్సై రవి ఆధ్వర్యంలో జాతర ప్రాంగణంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు. లడ్డు రూ.20కి బదులు రూ.30కి విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపించారు. ఆలయచైర్మన్ మల్లారెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.


శంకరపట్నం: ధ్వజస్తంభం వద్ద భక్తుల మొక్కులు


శంకరపట్నం: గుట్ట పైనుంచి దిగుతున్న భక్తులు


శంకరపట్నం: క్యూలైన్‌లో భక్తులు

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


మానకొండూర్: సత్తా చాటిన దేవంపల్లి గురుకుల విద్యార్థులు

మానకొండూర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మానకొండూరు మండలం దేవంపల్లి గురుకుల పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం తెలిపారు. రాచపల్లి ప్రదీప్ 92.2 పర్సంటైల్, జి. లోచన్ 84.27, కే.హరికుమార్ 73.94, పి.రామ్‌చరణ్ 67.94, డి.రంజిత్‌కుమార్ 67.2 శాతం మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రేణికుంట బాబు తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన చొప్పదండి విద్యార్థులు


చొప్పదండి: అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం

చొప్పదండి: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరిశారు. మడిపల్లి సాయికిరణ్ 79.81, తమ్మడి విష్ణువర్దన్ 62.69 శాతం మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శరత్‌బాబు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలు


జెండా ఎగుర వేస్తున్న యూనియన్ నాయకులు

జమ్మికుంట: తెలంగాణ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్(టీఈఈ) విద్యుత్ కార్మికుల 1104 యూనియన్ 75వ ప్లాటినం జూబ్లీ వేడుకలు జమ్మికుంట డివిజన్ స్థాయిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జెండా ఎగురవేసి సీట్లు పంపిణీ చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ఆఫీస్‌బేరర్ రాములు మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల హక్కులు, సమస్యలపై టీఈఈ యూనియన్ స్వతంత్ర ప్రతిపత్తిగా ఉనికిని కాపాడుకుంటూ 75 ఏళ్లుగా పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, అడిషనల్ సెక్రెటరీ అశ్వత్‌కృష్ణ, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు మనీష్, యాకత్‌అలీ, రవి, శ్రీనివాస్, రాజన్న, మోహన్, సంపత్, మనోహర్, వేణుగోపాల్, మైపాల్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం టీబీముక్త్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీ లక్షణాలు ఉన్నవారికి ప్రత్యేక పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. అనంతరం జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులు దుమ్ము, ధూళి, పొగ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని, ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నెలనెలా పరీక్షలు చేయించుకోవాలని, టీబీ రహిత భారత్‌లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు చందన, కార్తీక్, ఆరోగ్యశాఖ సిబ్బంది రాధ, నరేందర్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మహేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, ఆశాలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.